క్లుప్తంగా

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు అపర్ణ ఎంపిక


వాయల అపర్ణ

సింగరాయకొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు అండర్–19 బాలికల విభాగంలో పాకల విద్యార్థిని వాయల అపర్ణ ఎంపికైంది. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ట్రిపుల్ జంప్‌లో అపర్ణ ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో నిర్వహించనున్న పోటీల్లో అపర్ణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా అపర్ణను పాకల హైస్కూల్ పీడీ పిల్లి హజరత్తయ్య, గ్రామస్తులు అభినందించారు.

సాయిబాబా మందిరంలో అన్నదానం

కనిగిరి రూరల్: పట్టణంలోని సాయిబాబా గుడిలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు మాకినేని సాయిరాం, ముక్కు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

స్పందనను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు: ప్రతి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి డివిజన్‌లోని అన్ని శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరవుతారని సబ్‌కలెక్టర్ శోభిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

ఉలవపాడు: మండల పరిధిలో గురువారం పలు కార్యక్రమాల్లో సబ్ కలెక్టర్ శోభిక పాల్గొన్నారు. ఉలవపాడులో గత కొంత కాలంగా వివాదాస్పదంగా ఉన్న భూమికి సంబంధించి స్పందనలో అర్జీ నమోదు కావడంతో సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. ఒక వర్గం వారు భూమి తాను రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, మరో వర్గం వారు అక్కడ దారి ఉందని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఇరు వర్గాల వాదనలు విన్న ఆమె పూర్తి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం ఉలవపాడు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. స్పందన కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. తదనంతరం బద్దిపూడి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అలాగే కృష్ణాపురం గ్రామంలో భూముల రీసర్వేను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ బ్రహ్మయ్య, మండల సర్వేయర్ శ్రీనివాసులుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పని చేయాలి

లింగసముద్రం: అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేయాలని ఏపీఓ అబ్దుల్లా ఉపాధి హామీ కూలీలకు సూచించారు. గురువారం మాలకొండ్రాయునిపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ.. కూలీలకు మంచినీరు, మజ్జిగతో పాటు ఎండ తగలకుండా టెంట్లు వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ ఉత్సవం

వలేటివారిపాలెం: మండలంలోని చుండి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ–పోతురాజు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. చుండి గ్రామానికి చెందిన ముతకని రత్తయ్య అమ్మవారి ఆలయానికి రూ.10 వేల విలువైన మైక్ సెట్ బహూకరించారు.

వరదరాజస్వామి ఆలయ అభివృద్ధికి రూ.25 వేల విరాళం

కందుకూరు రూరల్: కందుకూరు మండలంలోని ఓగూరు గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి సూచన మేరకు కందుకూరు పట్టణానికి చెందిన పబ్బిశెట్టి శివ, మురారిశెట్టి శ్రీకాంత్ రూ.25 వేలను ఆలయ కమిటీ చైర్మన్ చీమల రాజుకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను చైర్మన్ అభినందించారు.

వైభవంగా బొడ్డురాయి ప్రతిష్ట

టంగుటూరు: మండలంలోని అనంతవరం గ్రామంలో గురువారం బొడ్డురాయి ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది పండితులతో గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించిన 12 మంది పెద్దలను అనంతవరం ఎంప్లాయీస్ నాయకులు సన్మానం చేశారు. అనంతరం భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అనీల్ కుమార్, కె. కృష్ణయ్య, వై. కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న ఆణిముత్యాలు’ వీరే..

- కనిగిరి నియోజకవర్గంలో 8 మంది విద్యార్థులు ఎంపిక
- నలుగురు టెన్త్, మరో నలుగురు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు బహుమతులు


నేరెళ్ల హరికృష్ణ


వెంకట ప్రహ్లాదరెడ్డి


ఎ.వెంకట మణికంఠ


ముప్పూరి స్పందన

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలకు ప్రభుత్వం ఎంపిక చేసింది. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పదో తరగతి విద్యార్థులు నలుగురు, ఇంటర్మీడియెట్ విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ఎంఈఓ జె.ప్రసాద్‌రావు తెలిపారు.

☛ వెలిగండ్ల మండలం మొగుళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నేరెళ్ల హరికృష్ణ(586 మార్కులు), ఆవుల వెంకట ప్రహ్లాదరెడ్డి(586 మార్కులు) మొదటి బహుమతికి, కనిగిరి ఆదర్శ పాఠశాలకు చెందిన అంబవరం వెంకట మణికంఠ(582 మార్కులు) ద్వితీయ బహుమతికి, పీసీపల్లి మండలం నేరేడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముప్పూరి స్పందన(581 మార్కులు) తృతీయ బహుమతికి ఎంపికైనట్లు ఎంఈఓ వివరించారు. వీరికి మొదటి బహుమతి రూ 15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5వేలతోపాటు పతకాలను ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. అలాగే జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో కూడా మొగుళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నేరెళ్ల హరికృష్ణ, ఆవుల వెంకట ప్రహ్లాదరెడ్డి ప్రతిభ చాటారని హెచ్‌ఎం రాజాల కొండారెడ్డి తెలిపారు.

☛ ఇంటర్మీడియెట్ బైపీసీలో ఎస్‌కే తౌసీఫ్(929 మార్కులు), సీఈసీలో వేసిపోగు మరియదాసు(843 మార్కులు), హెచ్‌ఈసీలో ఎస్‌కే నాగూర్‌బీ(929 మార్కులు), ఎంపీసీలో పద్యాల అజయ్(947మార్కులు) జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి రూ.15 వేలు బహుమతి, పురస్కారాలు అందజేయనున్నారు.

మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావం


టంగుటూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

టంగుటూరు: మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావం తెలుపుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం టంగుటూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రెజ్లర్లను వేధించిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న రెజ్లర్లతో పోలీసులు వ్యవహరించిన తీరును ఖండించారు. కేవీపీఎస్ నాయకుడు మోజెస్ మాట్లాడుతూ.. లైంగిక వేధింపులకు కారకులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాము, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఉలవపాడు ఎస్సై


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై బాజిరెడ్డి

ఉలవపాడు: ఉలవపాడు ఎస్సైగా బాజిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై త్యాగరాజు వీఆర్‌కు వెళ్లడంతో దుత్తలూరులో విధులు నిర్వర్తిస్తున్న బాజిరెడ్డి ఉలవపాడుకు బదిలీపై నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

విద్య, మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం


గోపాలపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లక్ష్మి

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన పామూరు 4వ సచివాలయం పరిధిలో, 5వ సచివాలయం పరిధిలోని గోపాలపురంలో గురువారం రూ.20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 10 సచివాలయాల పరిధిలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. త్వరలోనే మరో 9 సచివాలయాల పరిధిలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. వైస్ ఎంపీపీ షేక్.రషీద్, ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ రాగమ్మ, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్, కోఆప్షన్ సభ్యుడు నాయబ్‌రసూల్, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, ఎంపీటీసీ అబ్దుల్, చల్లా సుబ్బారావు, ఇర్రి క్రిష్టారెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వర రెడ్డి, ఖాదర్‌బాషా, ఓ. ఏడుకొండలు, శ్రీరాం శ్రీను, నాయబ, జిలాని, యోగీశ్వరరెడ్డి, ప్రసాదు, ఎస్.నాయబ పాల్గొన్నారు.

రెస్టారెంట్లలో అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు


రెస్టారెంట్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ రామరాజు

కొండపి: రెస్టారెంట్లల్లో అక్రమంగా మద్యం విక్రయిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు హెచ్చరించారు. కొండపిలోని సర్కిల్‌ఇన్స్పెక్టర్, సబ్‌ఇన్స్పెక్టర్ కార్యాలయాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ వై.పాండురంగారావు, ఎస్సై వైవీ రమణయ్యతో మట్లాడారు. రికార్డులు పరిశీలించి కేసుల పరిస్థితి తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని రెస్టారెంట్ల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పెరిదేపి గ్రామం వెళ్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న స్థలంలో కట్టడాలు ఏమీ నిర్మించవద్దని, గ్రామస్తులు శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని డీఎస్పీ సూచించారు.

మలేరియా నివారణలో భాగస్వాములు కావాలి

- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్


ర్యాలీలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మలేరియా నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పిలుపునిచ్చారు. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయని, తద్వారా వ్యాధులు బారిన పడకుండా ఉండవచ్చన్నారు. వైద్యాధికారి డాక్టర్ ప్రియార్షనంద మాట్లాడుతూ.. ప్రతి మంగళ, శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని కోరారు. సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సూపర్ వైజర్ బాలుడు, హెల్త్ సెక్రటరీ లక్ష్మీ, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని పైరెడ్డిపాలెంలో సీతారామస్వామి తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ఆయన మాట్లాడారు. పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధంలో పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్ అభివృద్ధే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. బాబు వస్తే జాబ్ వస్తుందని చెప్పిన చంద్రబాబు ఉన్న ఉద్యోగాలను ఊడబెరికారని ధ్వజమెత్తారు. మళ్లీ కాపీ పేస్ట్ మేనిఫెస్టో ప్రకటించి ప్రజలను మభ్యపెట్టాలని చూడటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతి రెడ్డి, కర్నా మస్తాన్‌రెడ్డి, సగిలి శ్రీనివాసులరెడ్డి, సగిలి సుధాకర్‌రెడ్డి, కోటిరెడ్డి, శ్రీరాములరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఏడుకొండలు, సర్పంచులు మన్నెం చినవెంకటేశ్వర్లు, ఎస్‌కే చిన్న మస్తాన్, చేవూరి పద్మనాభరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుల్తాన్‌బీబీ గంధ మహోత్సవం


ప్రత్యేక పూల అలంకరణలో సుల్తాన్ బీబీ అమ్మవారు


దర్గా ముందు ఆకట్టుకుంటున్న తాజ్‌మహల్ విద్యుత్ అలంకరణ

గుడ్లూరు: మండలంలోని తెట్టు గ్రామంలో వెలసియున్న సయ్యద్ సుల్తాన్ బీబీ అమ్మవారి 132వ గంధ మహోత్సవం గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. దర్గా మౌలానా మస్తాన్ షరీఫ్, దర్గా ప్రెసిడెంట్ మహబూబ్ బాషాల ఆధ్వర్యంలో అమ్మవారి సమాధిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే గంధ మహోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కూడా హిందు, ముస్లిం భక్తులు వేలాది మంది పాల్గొని అమ్మవారి సమాధిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. దర్గా పరిసరాలలో ఏర్పాటుచేసిన కవాళీ పాటకచేరి విశేషంగా ఆకట్టుకోగా బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కందుకూరు డీఎస్పీ రామచంద్ర ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, పది మంది ఎస్సైలు 200 మంది పోలీసు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్


క్షతగాత్రుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

వెలిగండ్ల: మూల మలుపులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పద్మాపురం వద్ద గురువారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. మండలంలోని పద్మాపురం మలుపు సమీపంలో కర్రలోడు ట్రాక్టర్ రోడ్డుకి ఒక వైపున ఆగి ఉంది. ఈ క్రమంలో మొగులూరు వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ వ్యక్తి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను గమనించకుండా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని కనిగిరి వైద్యశాలకు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

లింగసముద్రం: మండలంలోని వీఆర్ కోట వద్ద మన్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం తెల్లవారుజామున మన్నేరు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారులకు పరుగు పందెం

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీలో 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా నీతి కథలు చదివించారు. పరుగు పందెం విజేతలకు ఆదివారం బహుమతులు అందజేస్తామని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు.

5 నుంచి ‘జగనన్నకు చెబుదాం’

ఉలవపాడు: ఈ నెల 5 నుంచి ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

మద్దిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై పి.అంకమ్మరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం పలు వాహనాలను ఆయన తనిఖీ చేశారు. వాహనాదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 10 వాహనాలకు రూ.1200 జరిమానా విధించారు.

టుబాకో బోర్డు ఈడీకి భారతీయ కిసాన్ సంఘ్ అభినందన


ఈడీ శ్రీధర్‌బాబును అభినందిస్తున్న కిసాన్ సంఘ్ నాయకులు

కందుకూరు: పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్న టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబును భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు అభినందించారు. గురువారం గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో ఈడీని మర్యాదపూర్వకంగా కలిశారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులు తిరిగి సాగు చేసిన పంటను నామమాత్రపు అపరాధ రుసుంతో అమ్ముకునేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి ఉన్నం సింహాద్రి, పొగాకు బోర్డు కన్వీనర్ ఉన్నం నవకృష్ణ, పొగాకు బోర్డు మాజీ వైస్ చైర్మన్ గుండాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

- రూ.61,110 నగదు స్వాధీనం

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి చెరువు సమీపంలోని పొలాల్లో పేకాట స్థావరంపై గురువారం సాయంత్రం సెబ్, ఒంగోలు జేడీ టీమ్ అధికారులు, సిబ్బంది మారువేషాల్లో వెళ్లి దాడి చేశారు. 12 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.61,110 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులతోపాటు నగదును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై మహమ్మద్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. దాడిలో సెబ్ ఎస్సై దయాకర్, ఒంగోలు జేడీ టీమ్ ఎస్సై ఎన్‌వీ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం


నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బుర్రా, నాయకులు

పామూరు: పామూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత, కాపు సంఘ జిల్లా నాయకుడు ఆకుపాటి రమణయ్య కుమారుడు డాక్టర్ ఆకుపాటి కిషోర్, స్వప్న వివాహం స్థానిక పువ్వాడి ఫంక్షన్ హాల్లో జరిగింది. బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, ముస్లిం మైనారిటీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఇక్బాల్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, యాదాల సాయికిరణ్, రాధారంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర, ప్రకాశం జిల్లా కాపు సంఘ అధ్యక్షుడు ఆమంచి స్వాములు, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అర్హులకు ప్లాట్ల కేటాయింపు


లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయిస్తున్న అధికారులు

కందుకూరు: మున్సిపాలిటీ పరిధిలో అర్హులకు గురువారం నివేశన స్థలాలు కేటాయించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, తసహీల్దార్ సీతారామయ్య లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికి ఇల్లు కార్యక్రమంలో భాగంగా అర్హులకు ఇంటి స్థలం ఇస్తోందని, ఇప్పటికే పట్టణంలోని దాదాపు 2 వేల మందికి పైగా పేదలకు స్థలాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. తాజాగా ఆరు లేఔట్లలో 441 మందికి స్థలం కేటాయించినట్లు చెప్పారు. స్థలం తీసుకున్న వారు త్వరగా ఇల్లు నిర్మించుకునేందుకు ప్రయత్నం చేయాలని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందిస్తుందని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన వరికూటి అశోక్‌బాబు


కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వరికూటి

టంగుటూరు: కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను ఒంగోలులోని ఆయన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కొండపి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు, టంగుటూరు మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, నాయకులు నల్లూరి సురేంద్ర, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, వాకా బాలకృష్ణారెడ్డి, గొట్టిపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రామణ మహాలక్ష్మి

వెలిగండ్ల: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రగతి సాధించాలని ఎంపీపీ రామణ మహాలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు సంక్షేమ పథకాలు అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేశారన్నారు. క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులు, ,ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతరెడ్డి మాట్లాడుతూ జెడ్పీ నిధులతో మండలాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించే తేదీ ముందుగా తెలియజేయడం లేదని గుడిపాటిపల్లి సర్పంచ్ కటికల రిబ్కా వెంకటరత్నం సభ దృష్టికి తీసుకురాగా సమాచారం ఇస్తామని డాక్టర్ చెప్పారు. సర్వ సభ్య సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.సుకుమార్, జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామణ తిరుపతరెడ్డి, వైస్ ఎంపీపీ టి.మేరీ పుష్ప, సింగిల్ విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో హోమం


స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

వెలిగండ్ల: మండల పరిధిలోని గుడిపాటిపల్లి గ్రామంలో కొండపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పగడాల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో గ్రామ పంచాయతీలోని ప్రతి కుటుంబం పాల్గొంది. కార్యక్రమంలో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గుంటక తిరుపతరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి, దుగ్గెంపూడి రామిరెడ్డి, అల్లు గోవిందరెడ్డి, చిట్టెం నరసింహారెడ్డి, గుంటక రమణారెడ్డి, కొండారెడ్డి, పోలెబోయిన రాములు, కాకర్ల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో 827 పొగాకు బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు కొనుగోలు కేంద్రానికి ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, తాటాకుపాలెం గ్రామాల రైతులు గురువారం 903 బేళ్లు తీసుకురాగా వ్యాపారులు 827 కొనుగోలు చేశారు. 64 పొగాకు బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. పొగాకు అత్యధిక ధర కేజీ రూ.201, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.193.30 రైతులకు దక్కిందని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.